# నిష్కృతి

ప్రభా

ఒక్క నిమిషం. ప్లీజ్ నా కథ వినండి. నాకు తెలుసు మీరు చాలా బిజీగా వున్నారు. అసలే ఊపిరాడని పని, దానికి తోడు ఈ ఉగాది కథల పోటీ ఒకటి. అయినా దయచేసి నా కథ వినండి. పోనీ ఇది ఒక పోటీ కథే అనుకొని నా కోసం పది నిమిషాలు స్పేర్ చెయ్యండి.

అవును, ఈ కథ మీకే చెప్పాలి. ఎన్నో కథలు చదివిన మీరు నన్ను పూర్తిగా అర్థం చేసుకుంటారనే ఆశతో యిది మీకు చెబుతున్నాను.

నేను మా అమ్మా-నాన్నల ఎక్స్పెరిమెంటల్ బాయ్ ని — కాదు "టాయ్"ని. జ్యేష్ఠపుత్రుడిని, జగతిలో వాళ్ళకి వచ్చిన పేర్లన్నీ నాకు పెట్టాలనుకున్నారు. వాళ్ళకు ఎంతగానో నచ్చి, చదవాలని చదవలేకపోయిన ప్రతికోర్సు నాచేత చదివించాలనుకున్నారు. నన్ను చక్కగా పెంచి, పెద్దచేసి ఎంతో గొప్పవాణ్ణి చేద్దామనుకొని. ఎన్నో ప్రయత్నాలు చేసి, ఎంతో కష్టపడి ఆఖరికి నన్ను ఈలాంటి దౌర్భాగ్యపు స్థితికి తెచ్చారు.



మేము ఒకప్పుడు బాగా బ్రతికిన వాళ్ళమే. నేను పుట్టకముందు మా పరిస్థితి చెప్పలేను గాని. నాకు జ్ఞానం వచ్చినంతర్వాత చాలా కాలం వరకు అంటే నేను ఎస్సెల్సీలో చేరేవరకు మా పరిస్థితి బాగానే వుండేది. అప్పుడే మా పెద్దచెల్లెలికి పెళ్ళి అయింది. సారీ! పెద్ద చెల్లెలి పేరు సరళ. తరువాత దానికి అంటే వేణికి నేను ఎస్సెల్సీ రెండవ సంవత్సరంలో వున్నప్పుడు పెళ్ళి అయింది. అప్పట్లో మా యింట్లో ఎక్కడ చూసినా, ఎవరి మొఖాల్లో చూసినా ఏదో సహోత్సాహం కనిపించేది. అపోలో–11లో భూమికి తిరిగి వస్తున్న ఆ ముగ్గురి మొఖాల్లోనూ బహుశా అటువంటి కళే కన్పించి వుంటుంది. ఏదో ఘనకార్యం సాధించాం యింకా ముందుముందుకి ఎన్నో సాధించాలనే ధీమా, ధైర్యంతో ఉత్సాహంగా మిలమిల మెరిసేవి ఆ కళ్ళు.

యిప్పుడో— సాధించినదానికి సార్థకత్వం లేకుండాపోయిందని. యిక సాధించవలసింది చాలా దూరంగా అందుబాటులో లేదని నిస్సహాయతతో, నిర్జీవంగా వెలవెలపోతున్నాయి అవే కళ్లు.

మా నాన్న డివిజనల్ ఎక్కౌంటెంటుగా వుండేవాడు. పై రాబడి చాలా వుండేదని చెప్పడానికి అప్పట్లో మా అమ్మ ఒంటిమీద నగలు, అమ్మ పేర బ్యాంకులో వున్న డబ్బు చాలు.

ప్రతి వ్యక్తికీ ఒక ఉచ్ఛదశ వుంటుంది— కొద్దిగానో, ఉధృతంగానో ఆ దశలో ప్రతివాడూ ఓ వెలుగు వెలుగుతాడు. ముందు వెనకలు ఆలోచించుకోడు. భవిష్యత్తు గురించి ఎంత శ్రద్ధ గలవాడైనా చివరికి ఏమీ మిగుల్చుకోలేడు. ఆ కొద్దిసేపూ కళ్ళు మూసుకు తన్మయత్వాన్ని అనుభవిస్తాడు. అంతే— మళ్ళీ కళ్ళు తెరచేటప్పటికి మామూలు స్థితికి దిగిపోతాడు. అది కలలాంటి బ్రతుకు. అయినా ఆ దశకోసమే ఎన్ని సార్లయినా మానవజన్మ ఎత్తాలనిపిస్తుంది.

ఆ దశదాటి మాకు అప్పుడే రెండేళ్ళు అయింది.

నేను ఎస్సెల్సీ పాసైనంత మాత్రాన డిగ్రీలో వస్తుకొను వచ్చినంత మాత్రాన, కాలేజీ అంతటికి ఫస్టుగా నిలబడినంతమాత్రాన నేను తెలివైన వాడినని చెప్పుకోను.

ఒకటే అంటాను—

కొత్త పైసాకి పనికిరాని మనిషికి విలువ యివ్వడం, ఒక నీచుడు, అవినీతిపరుడు అయిన వాడికి సంఘంలో గౌరవప్రదమైన చోటు ఇవ్వడం, ఒక కులటను అందరిముందు పతివ్రతలా నిల్చోపెట్టటం యివే కాదు డబ్బు చెయ్యగలిగిన పనులు. మనమంతా జన్మతః వస్తాయనుకున్న చదువూ సంస్కారాన్ని కూడా మనకి ప్రసాదిస్తుంది.

అదే నా విషయంలోనూ జరిగింది.

హైస్కూల్లో సరిగ్గా చదవకపోయినా ప్రతి సంవత్సరం ఎందుకు పాసయ్యానో నాకు తెలుసు. నాకే కాదు మా స్కూల్లో అందరికీ తెలుసు— ట్యూషన్లు.

కానీ నేను సెవెంత్ ఫారమ్ ఎలా పాసయ్యానో చాలామందికి తెలియదు. కొంతకాలం ఇంజనీరనీ, మరికొంత కాలం డాక్టరనీ అప్పట్లో అనేకమైన క్షణిక మార్పులు చెందింది నా చదువు. అయినా నేను మంచి మార్కులతోనే పాసయ్యాను. కొందరు సరిగ్గానే అనుమానించారు. నాకు తెలుసు అది డబ్బు మహిమని. డిగ్రీలోనూ సరిగా అలాగే జరిగింది. ఇక ఎస్సెల్సీ సంగతి వేరే చెప్పనక్కరలేదు. కానీ ఇప్పుడు నేను చదువూ, సంస్కారమూ ఉన్నవాడిని. నా చదువు డబ్బిచ్చి వేయించుకున్న మార్కులు.

నా సంస్కారం— అందమిచ్చి క్లాసులు దాటడం.

లోకం దృష్టిలో నేను విద్యాధికుణ్ణి, తెలివైన వాడిని, నేను కాను తెలివైన వాడిని. నన్ను యింత చదివించింది, అదే ఆ డబ్బు— అది తెలివైంది ఆ తరవాత ఎక్కడ అంతం అవ్వాలో ఎక్కడ దానికి రెట్టింపు గుంజాలో బాగా తెలిసిన మా నాన్న. అందుకే నావి కాని తెలివితేటలకు నాకు అన్యాయంగా సంక్రమించిన పట్టాలు నా కెందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

డబ్బిచ్చి మా నాన్న మార్కులు వేయించి నన్ను పైపైకి తీసుకెళ్తుంటే మొదట్లో అదో గర్వంగా ఉండేది. ఆ తర్వాత నాకు పూర్తిగా జ్ఞానం వచ్చినతర్వాత కూడా నేను అంత బాధపడలేదు.

కారణం?—

నాలాంటి వాళ్లు చాలామంది నా చుట్టూరా వున్నారు. మనం డబ్బిచ్చినందుకు వాళ్ళు మార్కులేస్తున్నారు. మనల్ని పాసు చేయిస్తున్నారు.

మనకి మార్కులేస్తున్నారు కాబట్టి ఆ మార్కులు మనం స్వతహాగా తెచ్చుకోలేము కాబట్టి మనం డబ్బిస్తున్నాము.

యిందులో నష్టపోతున్నది ఎవరు?

ఒకవేళ యిదే దురాచారమైతే దీన్ని నాశనం చెయ్యడానికి ఎవరు ముందుకి రావాలి?

డబ్బు యిస్తున్న వాళ్ళా?

డబ్బు పుచ్చుకుంటున్న వాళ్ళా?

—ఈ విషయాలు ఎవరూ ఆలోచించరు. అప్పట్లో నేనూ ఆలోచించ లేదు. కానీ నన్ను బాధ పెట్టిందల్లా ఒక్కటే. నాకు తెలుసు ఆ ఉసురే నన్నిప్పుడు కాల్చివేస్తుంది. ఆ ఉసురే నన్ను. నా డిగ్రీలను ఎందుకు పనికి రాకుండా చేసి. నిర్భాగ్యుడు, దౌర్భాగ్యుడు, యింట్లో వాళ్ళని పోషించలేని వాడి, ఆత్మాభిమానాన్ని చంపుకొని కాఫీ పోయించే స్నేహితుల్ని వెదికేవాడు. కాల్చిన గోల్డుఫ్లేకు సిగరెట్టుకి కక్కుర్తి పడేవాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ధైర్యం లేనివాడు. నిరుద్యోగిగా నన్ను చేసి పారేసింది.

అప్పట్లో నేను డిగ్రీ పరీక్షలు రాస్తున్నాను. మా నాన్నకి తెలుసు తన పుత్రరత్నం తెలివి



# నిష్కృతి

కేటు. అందుకే మానాన్న పరీక్ష ఎలా వ్రాశావని అడగలేదు. కానీ ఫలానా ఫలానా వాళ్ళు ఎలా వ్రాశారని నా చేత ఆరా చేయించేవాడు. నేను అప్పట్లో ఆ సంగతేమీ కు ఁను ఊహించుకోలేక పోయాను. మా కాలేజీలో కల్లా తెలివైన భానుమూర్తిని గురించి చాలా గొప్పగా చెప్పాను. నాన్నగారు 'అలాగా' అన్నట్టు తలపంకించారు. మూర్తి నా స్నేహితుడు. నా చిన్ననాటి స్నేహితుడు. నాతో పరిచయం ఎంతో గొప్పగా భావించుకొనేవాడు. అలాంటి వాళ్ళతో ఎవరైనా స్నేహం చెయ్యడానికి ఇష్టపడతారు. 'భజన' ఇష్టంలేని వాళ్ళను వేళ్ళపై లెక్కపెట్టవచ్చు ఈ దేశంలో భజనపరులకి లోటులేదు. కానీ మూర్తి అలాంటివాడు కాదు.

మా అమ్మ వాడిని, వాడి మురికి బట్టల్ని చూసి చీదరించుకొని, ఇయటికి బొమ్మని ఇకమీదట మా యింటికి రావద్దని అవమానించినప్పుడు, మా చెల్లెళ్ళు, తమ్ముళ్ళు వంతగా వాడికి కొత్త బట్టలు లేవని హేళన చేసినప్పుడు ఆఖరికి డిగ్రీలో మా యిద్దరి పేపర్లు తారుమారై నేను కాలేజీ ఫస్టువచ్చి, నాకు బదులు వాడు ఫెయిల్ అయినప్పుడు కూడా వాడు నన్నేమీ అనలేదు. పర్వాలేదని అదోలా నవ్వేడు. ఆ నవ్వే యిప్పుడు నన్ను కాల్చివేస్తుంది. ఆ నవ్వులో తీరని బాధ, ప్రతీకారం, అసహాయత అన్నీ ఒక్కుమ్మడిగా కన్పించాయి. ఈ డబ్బున్న వాళ్ళని చీల్చి చెండాడాలనే కసి, ప్రపంచంలో ఈ డబ్బు జబ్బుని వదలగొట్టాలనే ప్రతీకారం, అయ్యో మనమిలా ధనవంతుల్లో కలిసిపోయి మన వ్యక్తిత్వం, మన ప్రాథమిక హక్కులు అన్నీ కోల్పోయి, ఆత్మాభిమానం చంపుకొని, మన కనీస కోర్కెల్ని మర్చిపోలేక మళ్ళీ మనం మురిపించుకుంటూ, సభ్యులమనుకుంటున్నామనే వ్యథ అన్నీ స్పష్టంగా కన్పించేవి.

మూర్తి భావాలు ఒక్కొక్కసారి చాలా విప్లవాత్మకంగా వుండేవి. ప్రతీవ్యక్తి రాజ్యాంగంలో తన స్థానం, విలువ గుర్తించిననాడు ఈ డబ్బు-జబ్బు నయమవుతుందనేవాడు. ప్రజల్లో ఈ మార్పు రావడానికి చాలాకాలం పడుతుంది. ఎంతో మారణహోమం అవసరం. ఎందరో ఎంతో కాలం ఎంతో కష్టపడితే మనకి స్వరాజ్యం వచ్చింది. అదే పట్టుదలతో అందరం మరికొంత కాలం అంతకంటె ఎంతో కష్టపడితే గాని సురాజ్యం రాదంటాడు. దీనికి ఎంతో కార్యదీక్ష, ధైర్యం, ఉత్సాహం, వాటికి రెట్టింపు సహనం అవసరమంటాడు మూర్తి. అందుకే ప్రతిదానికీ ప్రశాంతంగా, ఎన్నో అర్థాలు స్ఫురించేలా నవ్వడం నేర్చుకున్నాడు.

"ఏన్షంట్ మారినర్ లో ఆల్బట్రాస్" లావంటా, "హార్ట్ లీవ్ వెల్ లో హార్ట్" లార్పులా మూర్తి నవ్వు నన్ను యింకా వెంబడిస్తూనే వుంది.

క్షమించాలి మీకు చాలా శ్రమ కలిగిస్తున్నాను. బహుశా నా యీ కథ మీకు విసుగ్గా వుండి వుంటుంది.


అవును. ఎదుటివాడి బాధలు కష్టాలంటే ప్రతీవాడికీ చులకనే. ప్రతివాడికీ ఏవో కష్టాలుంటాయి. అయినా రెండోవాడి గురించి ఆలోచించడు సన్నడిగితే. మనలో ప్రతి వొక్కడూ మన ఎదుటవాడి కష్టాల గుర్తించి కనీసం సానుభూతి చూపించిననాడు మన దేశం ఏ పంచవర్ష ప్రణాళికా అక్కర్లేకుండా అభివృద్ధి చెందుతుంది.

ఆవేశంలో ఏదేదో అనేస్తున్నాను. ఇది ఆవేశం కాదు. వేదాంతం అన్నా నేను ఒప్పుకోంటాను. అసలు విషయం మీకు క్లుప్తంగా చెబుతాను. మరొక్క పది నిమిషాలు ఓపిక పట్టండి.

లంచం తీసుకునేందుకు పక్కదగ్గ మా నాన్న బాధపడలేదు. కానీ అలవాటుపడ్డవాళ్ళు మా నాన్న యివ్వజూపిన లంచం తిరస్కరించినప్పుడు చాలా బాధపడ్డారు. తత్ఫలితంగా మా నాన్న ఉద్యోగం ఊడింది. ఆ లావాదేవీలలో చాలా డబ్బు ఖర్చయింది. కానీ ఫలితం దక్కలేదు. అప్పటికి కొద్దికాలం ముందే, అంటే నేను ఎమ్మెస్సీ ఆఖరు సంవత్సరంలో వున్నప్పుడు నా పెళ్ళి అయింది. నా భార్య ఇందిర పదివేల కట్నంతోనూ పాతికవేలు విలువచేసే నాటకాల జబ్బుతోనూ మా యింట ప్రవేశించింది. ఆ తరువాతనే నాన్నకి ఉద్యోగం పోయింది. మా పెద్ద బావ- సరళ మొగుడు అకస్మాత్తుగా గుండె ఆగి పోయాడు. అది మా యింటికి వచ్చేసింది. అప్పట్నుంచే మా దశ మారడం మొదలుపెట్టింది. వెలుగు తగ్గడం మొదలెట్టింది.

మా అమ్మ ఒంటిమీద నగల బరువు కొద్ది-కొద్దిగా తగ్గడం ప్రారంభించింది. దాంతో తనకి బ్లడ్-ప్రెషర్ హెచ్చడం ప్రారంభించింది.

అందరిలా నేనూ, యిది ఇందిర మా యింటి కొచ్చిన వేళా విశేషమని అనను. మేము వెలిగి, ఆరిపోతున్న ఆఖరు రోజుల్లో వచ్చిన ఆమె దురదృష్టానికి విచారిస్తాను.



ఈ ప్రపంచంలో సుఖపడేవాడు సుఖపడుతూనే వుంటాడు ఏదో పెద్ద కష్టం అడ్డువచ్చే వరకు. ఆ తరువాత వాడికన్ని కష్టాలే. అందరికీ తెలిసిన ఈ సత్యాన్ని మహాత్ములు సుకోమల భాషలో చెప్పిన మ్యాటరు ఎవరంత గొప్పదానిని నేను అనుకోను.

మా చెల్లెలు మొగుడు మిగిల్చింది ఇద్దరు ఆడపిల్లల్ని, గవర్నమెంటువారు నిలిపి వసూలు చేసిన "ప్రావిడెంటు ఫండ్" తప్ప మరేమీ లేదు. పిల్లల చదువులు అసలే తను చూడవలసుంది. కాన్వెంటు చదువులు — జీతం కట్టలేదని స్కూల్లో పేరు కొట్టేశారు. డబ్బులు సరిగ్గా ఇవ్వడం లేదని రిక్షావాడు ఏనాడో రావడం మానేశాడు. వాళ్ళిద్దరు పిల్లలకి మిగతా తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి కనీసం వంద రూపాయలు అయినా ఉండాలి. నన్ను మా నాన్న అందాలిచ్చి, ట్యూషన్లు చెప్పించి చదివించాడు. మిగతా వాళ్ళని నాలాంటి తెలివితేటలు కాదు స్వయంగా కష్టపడి చదవగలిగే శక్తి వున్నవాళ్ళు కాదు. ఇప్పుడు నేను మా వాళ్ళకి కనీసం స్కూలు ఫీజైనా సరిగ్గా కట్టలేకపోతున్నాను.

ఇంకా పెళ్ళి కెదిగిన చెల్లెళ్ళిద్దరున్నారు. వాళ్ళకి పెళ్ళిళ్ళు చేద్దామని చదువులు ఆపి ఇంట్లో కూర్చోపెట్టి సరైన సంబంధాలు తెచ్చి పెళ్ళిళ్ళు చెయ్యలేక మళ్ళీ చదువుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇప్పుడు ఫీజులు కట్టలేక ఆ చదువులు కూడా ఆపివేయ్యాల్సి వస్తుందేమో.

వీటన్నిటివల్ల మానసికంగా నలిగిపోయిన మా నాన్నకి తను వెలుగులో వున్నప్పుడు రాని టి.బి. యిప్పుడు వచ్చింది. నా గురించి, నా భవిష్యత్తు గురించి ఎందరిని గురించో, నానా అగచాట్లు పడి నన్నింత చదివించిన మా నాన్నకు నేను సరిగ్గా "ట్రీట్‌మెంట్" అయినా చేయించలేకపోతున్నాను. ఐదు వందలుంటే బాగుచేస్తానన్నాడు అప్పుడెవరో ఓ డాక్టరు. అది లేకే మా నాన్నను యింట్లో వుంచవలసి వచ్చింది.

నా ఎమ్మెస్సీ ఆఖరు సంవత్సరానికి, ఉద్యోగం కోసరం ఇచ్చిన లంచానికి, మూడో చెల్లెలు రాణి పెళ్ళికి వున్న ఆస్తి చాలామట్టుకు అయిపోయింది. లంచం పుచ్చుకున్నవాళ్ళు దానికి రశీదు గానీ, ఉద్యోగానికి గ్యారంటీగానీ యివ్వనందువల్ల నా ఉద్యోగం మూన్నాళ్ళ ముచ్చటై సంవత్సరం తిరక్కుండానే ఊడిపోయింది. ఎవర్నీ ఏమీ అడగలేకపోయాము. మళ్ళీ లంచమివ్వడానికి డబ్బు లేదు. "రిట్రెంచ్" పక్షినై పోయాను. ఆ తరువాత మళ్ళీ ఉద్యోగ దేవత నన్ను వరించలేదు. మరి ఆ ఆశలేదు. ముసలివాణ్ణయి పోతున్నానేమోననే అనుమానం వేస్తుంది.

రాణీ, వేణీ యిద్దరూ పండగకివస్తారు. వాళ్ళకి కొత్త బట్టలు కుట్టించాలి. యింకా బోల్డు చిల్లర ఖర్చులుంటాయి. వీటన్నిటికి కనీసం రెండొందలుండాలి.

డబ్బు — డబ్బు
డబ్బుకావాలి
ఎవరిస్తారు!

ఎప్పుడైతే మాకు డబ్బువుండి దానవసరం లేకో అప్పుడు అంతా అరువులిచ్చేవారే. అంతా అప్పులిచ్చేవారే. ఇప్పుడు డబ్బులేక నష్టాలు పడుతున్నప్పుడు. కనీసం ఒక రూపాయి అప్పు ఇచ్చే దాత, అరువు ఇచ్చే దుకాణందారు లేడు

అప్పట్లో మానాన్నకి బోల్డు పరువుండేది. కొంపా వాళ్ళం. అది పట్టీ భ్రమ అది మాకు అప్పట్లో వున్న డబ్బు. ఆ డబ్బుతోనే పరువు ప్రతిష్ఠ పోయాయి.

అమ్మకి ఖరీదైన మందులకంటే తక్కువ ఆరోగ్యకరమైన భోజనం, విశ్రాంతి కావాలన్నాడు డాక్టరు. అవి రెండూ లేవు. పరీక్షా ఫీజులకి బదులు నేను మా అమ్మకి - పన్ను గారాబంగా పెంచి, పెద్దచేసిన మా అమ్మ జీవితంతంగా గోరుముద్దలు తినిపించిన మా అమ్మ వద్ద ఉన్న ఏవేవో పిండివంటలు చేసి హాస్టలుకి పంపే మా అమ్మ. నా భవిష్యత్తు గురించి ఎన్నో తీపి కలలు కని, నామీద ఎన్నో ఆశలు పెంచుకున్న మా అమ్మకి నేను ఇప్పుడు ఇవ్వగలిగింది భరించరాని మనోవేదన. దారంలో పగం రోజులు పస్తులు. ఇదీ సార్! మా అమ్మ కన్న కలల కన్న కొడుకు ప్రతాపం.

"ప్రతివ్యక్తి జీవితంలో ఓ వెలుగు వెలుగుతాడు. నాకు ఆ దశ వుంది. నువ్వేం కంగారు పడకు. ఆ మంచిరోజు త్వరలోనే వస్తుందని" నేను ఇందిరకు చాలాసార్లు చెప్పాను.

తనేమంటుం ది.!

"నాకే మంచిదశా వద్దు. మీ తోటి ఈ జీవితం చాలు నాకు. అని ఎన్నో చెప్పి, నన్ను ఎంతో ఓదార్చి, నాకెంతో ధైర్యంచెప్పి, చివరికి పండక్కి పట్టుమని పాతిక రూపాయల విలువచేసే ఓ పట్టుచీర కావాలంటుంది తనకి. పిచ్చి ఇందిరకి తెలియదు., ఈ రోజుల్లో తను చెప్పే పటువంటి పట్టుచీరకి అలాంటి ఎన్ని పాతికలు కావాలో. నేను ఒప్పుకుంటాను, ఇదొక అల్ప్ రాల్ కోరికే. కానీ నాకు కాదే. అఫ్‌కోర్స్ నాకూ ఒకప్పుడిది చాల స్వల్పమయిందే!

మళ్ళీ చిన్న వెలుగు కనిపిస్తుంది. అది నా వెలుగు కాదు. నా ప్రక్క మన్న ఎవరో వెలుగుతున్నారు. ఆ వెలుగు పేదరిక.

ఉద్యోగం—!!

ఏదో ఆఫీసులో ఒక్కుమ్మడిగా బోల్డు ఖాళీలు అప్లికేషన్లు. అర్హతలు, ప్రవేశ పరీక్షలు అన్ని హంగులూ వున్నాయి. ఇవికాక లోపాయికారి "మదుపులు కూడా వున్నాయి. ఆఫీసులో మాకు బాగ తెలిసిన ఒకాయమున్నాడు, ఏదైనా సహాయం చేస్తాడు. కాని అతనిలో డబ్బు తీసుకోకుండా ఉద్యోగం ఇప్పించగల ఆత్మీయత లేదు. ఆ డబ్బు పూర్తిగా తనకికాదు. అందులో వాటాలున్నాయంటాడు, ఏమయితే నేం డబ్బు కావాలి. తంపెల్లో కావాలి డబ్బు వుంటే ఉద్యోగం తప్పకుండా వస్తుంది, సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం మంచి భవిష్యత్తు వుంటుంది, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి నెలాఖరున వుంటుంది. ఇంటర్వ్యూలు మార్చి నెలాఖరున గానీ, ఏప్రిల్‌లోగానీ వుంటాయి. ఆ తరువాత ఏప్రిల్ నెలాఖర్న పేనల్ తయారు చేస్తారు. అప్పుడు కొద్దిగ మదుపు పెడితేగాని ఉద్యోగం ఊనెత్తడానికి వీల్లేదు ఈ ఉద్యోగం వస్తే నా కష్టాలు చాలా మటుకు తీరుతాయి.

డబ్బు కావాలి. ఈ రోజుల్లో పండుగ అప్పు ఇచ్చేవాడు అందులో నాలాంటివాడికి - ఎవడు ఒక్కొసారి లాటరీ కడదామనిపిస్తుంది. కానీ నా అదృష్టంమీద నాకంత నమ్మకం లేదు. ఈమధ్య పొరుగింటోంది తెచ్చిన మీ పత్రిక చదువుతుంటే మీ రిచ్చిన ప్రకటన కనిపించింది. అందుకే మీకి ఉత్తరం రాస్తున్నాను. మీ రొక్కరే నాకి సహాయం చేయగలరు.

ఎడిటర్! మీరు నాకి చిన్న సహాయం చెయ్యాలి నా కథ విన్నారు కదా! ప్లీజ్. దీనికి ఏదో ఒక బహుమతి ఇచ్చేయండి. డబ్బు వెంటనే పంపించెయ్యండి. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకొనడానికి ప్రయత్నింతను. జన్మ-జన్మలకి గుర్తుంచుకుంటాను.

ఈ డబ్బు నేను మా అమ్మకి టానిక్కులు మందులు కొనడానికికాదు మా నాన్నకి ట్రీట్ చేయించడానికి కాదు పిల్లల చదు లకి కాదు నా ఇందిర పట్టుచీర కోసం కాదు. నా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకి కాదు. పెద్దైన వాళ్ళ పండగ పరదాలకి కాదు

ఇవితీరే రోజుగూర్చి తియ్యని కలలుకంటు కనిపెట్టడం మేము అలవాటు చేసుకున్నాం ఆ రోజు ఇంకెంత దూరంలో వున్నా ఆరోజు కోసం కనిపెడుతూ కాలాన్ని గడిపేయగలం ఆరోజు మా జీవితంలో రాకపోయినా పరవాలేదు. ఆ రోజు. మా ఈ కలలు ఆ రోజు గురించి తీపి కలలు కంటూ కనిపెడుతూ ఈ జీవితాన్ని గడిపేయగల .

అందుకే మీరివ్వబోయే ఈ డబ్బు వాటి వేటికీ కాదు......

నేను, మా యింట్లో మా ఇంట్లో యావన్మంది కనిపెడుతున్నది. మా కష్టాలను ఒడ్డుకు చేర్చేది. నా ఉద్యోగం.

మూర్తి కూడా ఈ ఉద్యోగానికి అప్లై చేశాడు. నా మూలంగా ఫైలయిన మూర్తి ఆ తరువాత సంవత్సరం సెకండ్ క్లాసులో పాసయ్యాడు. ఎమ్మెస్సీ చదవడానికి అతనికి శక్తి లేదు. ఉత్సాహం అంతకంటే లేదు. ఉద్యోగానికి కావలసిన "ఇన్‌ఫ్లూయన్స్". డబ్బు లేదు. నాలాగే కష్టాలో వున్నాడు! వాడు నన్ను క్షమించుకొని తిటి కొడితే నేను ఇంత బాధపడే వాడిని కాను. పైగ పంతోషిస్తాను. కాని వాడు నన్ను చూసి నవ్వుతున్నాడు. ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు. అందుకే నేనింతగా బాధ పడుతున్నాను.

ఇప్పటికీ మూర్తి నవ్వుతునే వున్నాడు. కాని ఆ నవ్వులో మునుపటి ఆవేశం, స్థైర్యం లేవు. ఇప్పుడున్నదల్లా నిర్లిప్తత బాధ చేసిన నిరసనం.

తరతరాలుగా మనలో ఉంటున్న శౌర్యం, క్రౌర్యం, చెడును ప్రతిఘటించే శక్తి ఇవన్నీ రోజు రోజుకీ తగ్గిపోతున్నాయి డబ్బు జబ్బు" వీటిమీద "స్లో పాయిజన్" లా పనిచేస్తుంది.

ఇవి పూర్తిగా నాశనం అయి మనలో కేవలము నిర్లిప్తత, వేదాంతం మిగిలిపోక ముందే మనం ఒకటై మన భుజబలం, బుద్ధిబలం చూపాలనే మూర్తి అలాటి మూర్తి ఇవాళ ఇవేమీ మాట్లాడడు. తనకేమీ పట్టనట్టు ఊరుకుంటాడు. పరిస్థితికి సర్దుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. దేనికీ నొచ్చుకోడు బాధ పడడు దానికి వాడి కర్తృత్వం లేదనుకుంటున్నాడేమో

తను ఏమి చెయ్యలేడు. తన ఆశయాలు ఫలించే రోజు ఇక రాదు తనోడిపోయానన్న భావాలు అతనిలో రాగా చితికిపోయాయి.

మామూలు గుమస్తా మనస్తత్వం అలవడిపోయింది.

మూర్తి కూడా ఈ డబ్బు జబ్బు స్లో-పాయిజన్‌కి బలైపోయాడు. అందుకే నేనిప్పుడు మరింత బాధపడుతున్నాను

అందుకే నాకు వచ్చేడబ్బు మూర్తి ఉద్యోగము నిమిత్తం లంచంగా ఇచ్చి అనాడు నేను తెలిసో తెలియకో చేసిన పాపానికి నిష్కృతి చేసుకోవాలని ఉంది

ఇంటికి దీపం కంటికి వెలుగు
"ఆంధ్రజ్యోతి"
సచిత్ర వారపత్రిక చదవండి!

